మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు


NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 14-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 346 Issue: 346

14 జూన్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:47 తిథి చతుర్దశి మ. 12:19 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం రోహిణి రా. 10:11 వరకు తరువాత మృగశిర యోగం ధృతి మ. 1:11 వరకు కరణం శకుని మ. 12:19 వరకు చతుష్పాద రా. 10:21 వరకు వర్జ్యం మ. 3:13 నుండి సా. 4:37 వరకు దుర్ముహూర్తం సా. 5:02 నుండి సా. 5:54 వరకు రాహుకాలం సా. 5:09 నుండి సా. 6:47 వరకు యమగండం మ. 12:16 నుండి మ. 1:54 వరకు గుళికాకాలం మ. 3:31 నుండి సా. 5:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 7:24 నుండి రా. 8:48 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:42 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana

# తెలంగాణ పోలీసులు 'వెరీ ఫాస్ట్'

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో జాతీయ పురస్కారం.. 19న అవార్డు అందుకోనున్న డీజీపీ సీవీ ఆనంద్

తెలంగాణ పోలీసు శాఖ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ (2025-26)'కు ఎంపిక చేసింది.

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా పూర్తి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 19న ఢిల్లీలో నిర్వహించనున్న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేడుకల్లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'వెరిఫాస్ట్' మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రక్రియ అంతటా పారదర్శకతను పెంచారు.



# హైడ్రా రంగనాథ్‌కు రూ.50 వేల ఫైన్

## గడువులోగా కౌంటర్ దాఖలులో విఫలం

## వెంగళరావునగర్ భూవివాదం కేసు

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో చెరువుల సంరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలతో హాట్ టాఫిక్‌గా మారిన హైడ్రాకు ఈసారి న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం, గడువులోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ వెంగళరావునగర్‌లో సర్వే నం.45లోని తరువాయి 2 వ పేజీలో...



# ఖండాంతర క్షిపణులూ తుత్తునియలు!

## శత్రు దుర్భేద్యంగా భారత రక్షణ సామర్థ్యం

## వరుసగా మూడు బీఎండీ ఫ్లైట్ టెస్టులు సక్సెస్

## ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల్లో భారత్

రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది.

న్యూఢిల్లీ: వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. -2 వ పేజీలో...

# రెడ్ అలర్ట్.. హై అలర్ట్



## ఆరు జిల్లాల్లో భారీ వర్షాలు!

### పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ.. రాష్ట్రవ్యాప్తంగా దంచి కొట్టిన వాన

### హైదరాబాద్ అస్తవ్యస్థం: వాతావరణశాఖ.. అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్

## ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ఎఫెక్ట్

తెలంగాణలో పలు జిల్లాల్లో ఆదివారం భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్‌కు రెడ్ అలర్ట్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. సిద్దిపేట, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించింది. అటు.. శనివారం హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దట్టమైన మబ్బులు నగరాన్ని కమ్మేశాయి. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, ఇబ్రహీంపట్నం, ఆదిభట్లలో కుండపోత వర్షం కురిసింది. సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం పడింది. సదాశివపేటలో ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. భారీ వర్షానికి శంషాబాద్ అతలాకుతలమైంది. శంషాబాద్ ప్రధాన రహదారి చెరువును తలపించింది. భారీ వర్షాలపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు చేశారు. హైదరాబాద్‌లో తరువాయి 2 వ పేజీలో...



# శంషాబాద్ విమానాలు దారి మళ్లింపు

శంషాబాద్, జూన్ 13 (ఈవార్తలు): గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో వాతావరణం అనూహ్యంగా మారిపోతోంది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు వెల్లడించారు. శనివారం కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. ప్రతికూల వాతావరణం, తక్కువ విజిబిలిటీ కారణంగా శంషాబాద్‌కు రావాల్సిన పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించినట్టు ప్రకటించారు.

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,908 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |

# జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ

## ఈ నెల 17న ఫ్రాన్స్‌లో కీలక చర్చలు



భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్‌లో సమావేశం కానున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ నెల 17న వీరిద్దరి మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నట్లు వైట్‌హౌస్ శనివారం ధ్రువీకరించింది. పలు అంశాలపై ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

వాషింగ్టన్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆతిథ్యమిస్తున్న జీ7 సదస్సు జూన్ 15 నుంచి 17 వరకు జరగనుంది. ఈ సదస్సుకు భారత్‌ను అతిథ్య దేశంగా ఆహ్వానించారు. ఇందులో పాల్గొనేందుకు ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఆయన ఫ్రాన్స్, స్లొవేకియా దేశాల్లో పర్యటించనున్నారు. 2025 ఫిబ్రవరిలో ట్రంప్ తిరిగి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ, ట్రంప్‌లు నేరుగా సమావేశం కానుండటం ఇదే తొలిసారి. ఈ భేటీలో ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు, ఇంధన సహకారం, ప్రాంతీయ భద్రత వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ సమావేశంలో తక్షణమే భారీ వాణిజ్య ఒప్పందాలు కుదిరే సూచనలు లేవని అమెరికా తరువాయి 2 వ పేజీలో...



# భారత ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

## జూన్ 30న బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు తరువాయి 2 వ పేజీలో...



# మిస్టర్ బీస్ట్.. 50 కోట్ల సబ్‌స్క్రైబర్లు

## యూట్యూబ్‌లో ఎవరికీ సాధ్యం కాని రికార్డు

న్యూయార్క్: ప్రముఖ యూట్యూబర్, కంటెంట్ క్రియేటర్ మిస్టర్ బీస్ట్ (జిమ్మీ డొనాల్డ్ సన్) యూట్యూబ్ చరిత్రలోనే ఎవరూ సాధించని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. తాజాగా ఆయన తన అధికారిక యూట్యూబ్ ఛానెల్ లో 50 కోట్ల మంది సబ్ స్క్రైబర్ల మైలురాయిని అధిగమించారు. ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగత క్రియేటర్ గా ఆయన సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇప్పటివరకు యూట్యూబ్ లో ఎన్నో రికార్డులు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జువాన్ హెర్నాండెజ్ అనే వెల్డర్ స్పేస్ ఎక్స్‌లో ఉద్యోగంలో చేరినప్పుడు 10,000 డాలర్ల విలువైన షేర్లు లభించాయి. తాజాగా, స్పేస్ ఎక్స్ ఐపీవో సాధించడంతో ఆ షేర్ల విలువ పెరిగి 10 లక్షల డాలర్లకు చేరుకుంది. అతనొక్కడే కాదు.. ఇతర వెల్డర్లు, క్యాంటీన్ సిబ్బంది.. ఇలా వేలాది మంది స్పేస్‌ఎక్స్ ఉద్యోగులు కంపెనీ ఇచ్చిన ఈక్విటీ (షేర్‌హోల్డింగ్) వల్ల మిలియనీర్లుగా మారారు.

# హర్మూజ్ దాటాలంటే పైకం కట్టాల్సిందే: ఇరాన్



పశ్చిమాసియా యుద్ధంపై శాంతి చర్చల వేళ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కీలక ప్రకటన చేశారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు ఇకపై ఉచితంగా ప్రయాణం ఉండదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇరాన్, ఒమన్ మధ్య కీలక ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఈ అంశమై ఇరు దేశాలు త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రకటించారు.

టెహ్రాన్: పశ్చిమాసియా యుద్ధంలో ప్రధానంగా చర్చంతే హర్మూజ్‌పైనే యుద్ధం ప్రారంభంలోనే ఇరాన్ హర్మూజ్‌ని దిగ్బందించడంతో ప్రపంచ చమురు రవాణాకు ఆటంకం తలెత్తింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తింది. ఈ నేపథ్యంలో అమెరికా ఈ జలసంధిని తెరవాలని ఎన్ని సార్లు కోరినా ఇరాన్ ససేమిరా అంది. తాజాగా శాంతి చర్చల ప్రస్తావన నేపథ్యంలో అబ్బాస్ అరాగ్చీ కీలక ప్రకటన చేశారు. అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ" జలసంధి నిర్వహణ మునుపటిలా ఉండదు. ఇందులో తరువాయి 2 వ పేజీలో...

# నేడే ఇరాన్‌తో ఒప్పందం: ట్రంప్



పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అమెరికా-ఇరాన్ ఒప్పందం ఆదివారం కుదరనున్నట్లు యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో ఒప్పందంపై జూన్ 14న సంతకాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. సంతకాలు జరిగిన వెంటనే హర్మూజ్ అందరికోసం తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తెలిపారు.

వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ మధ్య ఈ ఆదివారం శాంతి ఒప్పందం జరగే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంతకుముందు ప్రకటించారు. అయితే, పాక్ ప్రధాని ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఇరాన్ స్పందించింది. ఇప్పుడే ఒప్పందంపై సంతకాలు జరగవని, ఇందుకు మరింత సమయం పడుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందం జరుగుతుందని ట్రంప్ నుంచి ప్రకటన తరువాయి 2 వ పేజీలో...



# జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియలు

## షెడ్యూల్ ప్రకటించిన ఇరాన్ ప్రభుత్వం

టెహ్రాన్: ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల షెడ్యూల్ ఎట్టకేలకు ఖరారైంది. వచ్చే నెల జూలై 4 నుంచి రాజధాని టెహ్రాన్‌లో అంత్యక్రియల కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. గత ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడిలో 86 ఏళ్ల ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ తర్వాత ఇరు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో యుద్ధం కొనసాగడంతో, మార్చిలో జరగాల్సిన అంత్యక్రియలు వాయిదా పడ్డాయి. ఇటీవలే ఏప్రిల్ 8న ఇరు దేశాల మధ్య తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

14.6.2026

మేషం: కొన్ని వ్యవహారాలలో ఎంత కష్టించినా ఫలితం కనిపించదు. భూవివాదాలు చికాకు కలిగిస్తాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు తప్పవు. ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసి రావచ్చు. నూతన ఋణాలు చేస్తారు. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పనిభారం తగ్గుతుంది.

మిధునం: ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. విలువైన వస్తువులు సేకరిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. చేపట్టిన పనుల్లో అప్రయత్న విజయం సాధిస్తారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది. ధనపరంగా అనుకూలత పెరుగుతుంది.

కర్కాటకం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగాలలో కొద్దిపాటి సమస్యలు తప్పవు.

సింహం: ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. బంధు మిత్రులతో ఊహించని విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు తప్పవు. ఋణదాతల ఒత్తిడులు చికాకు కలిగిస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు సాధారణంగా సాగుతాయి.

కన్య: ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. కొత్త పనులు ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

తుల: కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయులు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ ఫలిస్తుంది. సోదరుల నుంచి ఆకస్మిక ధనప్రాప్తి పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి.

వృశ్చికం: ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన మానసిక సమస్యలు కలుగుతాయి. కొన్ని పనులు శ్రమతో కానీ పూర్తికావు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపార,ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

ధనస్సు: దూరపు బంధువులు నుండి అరుదైన ఆహ్వానలు ఆశ్చర్య పరుస్తాయి. వ్యాపారాలు మరింత లాభసాటిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు పరుస్తుంది. వృధా ప్రయాణాలు చేస్తారు. ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. రాజకీయ వర్గం వారి నుండి అరుదైనా ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సన్నిహితుల నుంచి ధనలాభ సూచనలున్నవి. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఉద్యోగాలలో బాధ్యతల నుండి కొంత ఉపశమనం పొందుతారు.

కుంభం: ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉంటుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యయ ప్రయాసలతో కానీ పనులు పూర్తికావు. బంధువులు మీ మాటతో విభేదిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో స్వల్ప వివాదాలు తప్పవు.

మీనం: సంఘంలో పెద్దల నుండి ఊహించని ఆహ్వానాలు అందుతాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో విశేషంగా గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన వ్యవహారాలు కార్యరూపం దాలుస్తాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో ఆటుపోట్లు తొలగుతాయి.

# హై అలర్ట్



**మొదటి పేజీ తరువాయి**

ఉన్నతాధికారులు హై అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను అలర్ట్‌గా ఉంచాలని సీఎం ఆదేశించారు. పోలీసు, ట్రాఫిక్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సీఎస్, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్‌లతో సమీక్షించి నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కొండాపూర్ మండలంలో గంటన్నర వ్యవధిలోనే 8.1 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షం ధాటికి జన జీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమైంది. సదాశివపేట వద్ద రహదారిపై భారీ వృక్షం గాలికి విరిగిపడింది. సదాశివపేట చౌరస్తాలో బలమైన ఈదురుగాలులకు పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ షెడ్డు నేలకూలింది. అప్రమత్తమైన అధికారులు.. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌లో ఈదరుగాలులతో భారీ వర్షం కురిసింది. వలిగొండ రోడ్డులో రహదారిపై భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 16 తేదీ నుంచి అధిక వర్షాపాతం నమోదవుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి శ్రావణి తెలిపారు. వరుసగా మూడు రోజులు తమ ప్రాంతంలో వర్షాలు కురిస్తేనే రైతులు విత్తనాలు వేసుకోవాలని ఆమె సూచించారు. హైదరాబాద్‌లో 17,18 తేదీలలో భారీ వర్ష సూచన ఉందని.. ఎల్‌నినో ఎఫెక్ట్ ఆగస్ట్, సెప్టెంబర్‌లో ఉంటుందన్నారు. ఎల్‌నీలో ప్రభావంతో చలికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయని.. ఎండాకాలం ఉండాల్సిన వేడి కంటే ఎక్కువ నమోదు అవుతుందని తెలిపారు.

ఏపీలోనూ భారీ వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌కు వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్రానికి భారీ వర్షసూచన జారీ చేసింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశముందని స్పష్టం చేసింది. ఉరుములు, మెరుపల్ను పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద ఉండొద్దని, అలాగే భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించింది. భారీ వర్షాల క్రమంలో బయటకు రావొద్దని తెలిపింది. ఆదివారం శ్రీకాకుళం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణశాఖ స్పష్టం చేసింది. మిగతా 23 జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. అయితే శనివారం సాయంత్రం 6 గంటల నాటికి మార్కాపురం జిల్లా కోవిలంపాడులో 41మిమీ, అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 24మిమీ, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 22.5 మిమీ వర్షపాతం రికార్డైందని వాతావరణ శాఖ అధికారి ప్రఖర్ జైన్ చెప్పారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

## జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ

**మొదటి పేజీ తరువాయి**

అధికారులు తెలిపారు. ఈ చర్చల అనంతరం అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ భారత్‌లో పర్యటించనున్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కొంత క్లిష్టంగా మారాయి. భారత ఎగుమతులపై అమెరికా విధిస్తున్న సుంకాలు, రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లు వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, ఒమన్ తీరంలో అమెరికా చేపట్టిన చర్యల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరగనున్న ఈ భేటీ, ఇరు దేశాల మధ్య సంబంధాలను పునరుద్ధరించి, తిరిగి గాడిన పెట్టడానికి ఒక కీలక అవకాశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



## జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియలు

**మొదటి పేజీ తరువాయి**

తాత్కాలిక సంధి కుదరడంతో ఇప్పుడు అంత్యక్రియల నిర్వహణకు మార్గం సుగమమైందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. జూలై 4 - 6 వరకు రాజధాని టెహ్రాన్‌లో అంత్యక్రియల కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని మూడు రోజుల పాటు అక్కడే ఉంచుతారు. జూలై 7 వ తేదీన పవిత్ర నగరం 'కోమ్'లో ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 9 న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ప్రసిద్ధ 'ఇమామ్ రెజా ష్రైన్' వద్ద అంతిమ ఖనన సంస్కారాలు పూర్తి చేస్తారు. 1989లో ఇస్లామిక్ విప్లవ పితామహుడు అయతుల్లా రుహెల్లా ఖమేనీ మరణం తర్వాత అలీ ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. సుమారు మూడు దశాబ్దాల పాటు ఇరాన్ సైనిక, పారామిలటరీ వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తబా ఖమేనీ తెర వెనుక ఉండి అమెరికాతో జరుగుతున్న చర్చల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల పేర్కొన్నారు.



## ఖండాంతర క్షిపణులూ తుత్తునియలు!

**మొదటి పేజీ తరువాయి**

డీఆర్డీవో నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్డీవో విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్డీవో శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

## నేడే ఇరాన్‌తో ఒప్పందం: ట్రంప్

**మొదటి పేజీ తరువాయి**

రావడం గమనార్హం.ఇక యుద్ధాన్ని ముగిద్దాం ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించాల్సిన సమయం ఆసన్నమైందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం చెప్పినట్లు ఆక్సియోస్ వార్తాసంస్థ శనివారం తెలిపింది. నెతన్యాహుకు ఫోన్ చేసిన ట్రంప్ అమెరికా, ఇరాన్ మధ్య కుదరనున్న ఒప్పందాన్ని గొప్ప ఒప్పందంగా అభివర్ణించినట్లు అమెరికా సీనియర్ అధికారి ఒకరిని ఉటంకిస్తూ ఆక్సియోస్ పేర్కొంది. ఇదే ఆ ఒప్పందం. ఇదో గొప్ప ఒప్పందం. ఈ యుద్ధానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ అణు కార్యక్రమం గురించి ఆ ఒప్పందంలో తప్పక ప్రస్తావించాలని ఆందోళన వ్యక్తం చేసిన నెతన్యాహు అమెరికా అధ్యక్షుడితో పెద్దగా వాదనకు దిగలేదని ఆ అధికారి చెప్పారు. ఇక ఒప్పందం జరగడం ఖాయమని, దాన్ని తాను అడ్డుకోలేనని నెతన్యాహు గ్రహించి ఉంటారని ఆ అధికారి అన్నారు. తనకు మాట మాత్రమైనా చెప్పకుండా ఇరాన్‌తో అమెరికా ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల నెతన్యాహు ఆశ్చర్యం వ్యక్తం చేశారని ఓ ఉన్నతస్థాయి వర్గం ఆక్సియోస్‌కు తెలిపింది.

## మిస్టర్ బీస్ట్.. 50 కోట్లు సబ్‌స్క్రైబర్లు

**మొదటి పేజీ తరువాయి**

నమోదైనా, ఒక వ్యక్తిగత ఛానెల్ ఈ స్థాయికి చేరుకోవడం ఇదే ప్రథమం. ఈ చారిత్రక ఘట్టానికి అభిమానులు కూడా ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. 50 కోట్ల మార్క్ కు చేరువవుతున్న సమయంలో మిస్టర్ బీస్ట్ తన ఛానెల్ లో లైవ్ స్ట్రీమ్ నిర్వహించారు. సబ్ స్క్రైబర్ల సంఖ్య లక్ష్యానికి దగ్గరవుతున్న కొద్దీ వీక్షకుల్లో ఉత్కంఠ పెరిగింది. చివరి లక్ష మంది సబ్ స్క్రైబర్లు కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే చేరడం విశేషం. ఆ తర్వాత ఛానెల్ అధికారికంగా 50 కోట్ల మార్క్ ను దాటి యూట్యూబ్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. దీంతో మిస్టర్ బీస్ట్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు.

## హర్మూజ్ దాటాలంటే పైకం కట్టాల్సిందే: ఇరాన్

**మొదటి పేజీ తరువాయి**

అంతర్జాతీయ జలమార్గం ఏది లేదు. ఇది పూర్తిగా ఇరాన్, ఒమన్ సార్వభౌమాధికారం కిందకి వస్తుంది. ఈ జలసంధి గుండా పయణించే నౌకలకు అందించే సేవలు ఇకపై ఉచితంగా ఉండవు. ఇందులో నుంచి ప్రయాణించే నౌకలు ఖచ్చితంగా రుసుము చెల్లించాల్సి ఉంటుంది." అని అన్నారు. ఈ విషయమై ఒమన్‌తో చర్చలు పూర్తయ్యాయి. హర్మూజ్ జలసంధి భద్రత, నియంత్రణపై ఇరు దేశాలు త్వరలో సంయుక్త కార్యాచరణ ప్రకటిస్తాయి అని అన్నారు. కాగా ఇదివరకూ హర్మూజ్ గుండా ప్రయాణించే నౌకలకు ఎటువంటి పన్ను ఉండేది కాదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇరుదేశాలు మునుపటి కార్యాచరణనను మార్చాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## భారత ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్



**మొదటి పేజీ తరువాయి**

నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# పట్టుబడ్డ కోటి గంజాయి

**కొణిజర్లలో పట్టుకున్న ఈగల్ ఫోర్స్**

**ముఠాపై 18 నెలలుగా నిఘా**



ఖమ్మం: ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు సాగుతున్న భారీ గంజాయి స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను తెలంగాణ నార్కోటిక్స్ పోలీసు విభాగం ఈగల్ ఫోర్స్ బట్టబయలు చేసింది. ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని కొణిజర్ల పోలీసులతో కలిసి జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో సుమారు కోటి రూపాయల విలువైన 200 కిలోల 104 ప్యాకెట్లు ఎండు గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భారీ ఆపరేషన్‌లో ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేయగా.. ప్రధాన సూత్రధారి, సప్లయర్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు స్విఫ్ట్ డిజైర్, బొలెరో వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.2,800 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ముఠా పట్టివేత వెనుక ఈగల్ ఫోర్స్ అధికారుల 18 నెలలుగా నిఘా ఉంచారు. గతంలో నల్గొండ జిల్లా విజయపురి టౌన్ పీఎస్‌లో 336 కిలోల గంజాయి కేసులో అమోల్ నానోబా గోరే, వసంత జాదవ్ అనే పాత నేరస్థులు ఉన్నారు. అప్పటి నుంచి వీరి కదలికలపై అధికారులు నిఘా ఉంచారు. ఇదే సమయంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన షేక్ అన్సార్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తూ యువతను నిర్వీర్యం చేస్తున్నాడంటూ ఓ పౌరుడు 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ పక్కా సమాచారంతో దర్యాప్తు ప్రారంభించిన అధికారులు ఈ రెండు ముఠాలకు ఉన్న లింకును పసిగట్టారు. జూన్ 7న సాయంత్రం స్విఫ్ట్ డిజైర్, బొలెరో వాహనాల్లో ఏపీ ఒడిశా బోర్డర్‌కు వెళ్లిన ఈ ముఠాను వెంబడించారు. వారు అక్కడ గంజాయిని లోడ్ చేసుకుని తెలంగాణ వైపు వస్తుండగా ఖమ్మం వద్ద కొణిజర్ల పోలీసుల సాయంతో అడ్డగించి పట్టుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో.. మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు చెందిన ప్రభు అనే వ్యక్తి ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన ఫైనాన్షియర్ కింగ్‌పిన్. గంజాయిని రవాణా చేసేందుకు పాత నేరస్థులైన వసంత, అమోల్‌లను పావులుగా వాడుకున్నాడు. ఉద్గీర్‌కు సరుకు చేర్చితే కిలోకు రూ.10 వేల చొప్పున కమీషన్ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. మార్చి నెలలో రాజమండ్రిలో ఒడిశాకు చెందిన సప్లయర్ దేవి సింగ్ తో వీరు డీల్ మాట్లాడుకున్నారు. గతంలో ఇదే మార్గంలో 100 కిలోల చొప్పున రెండు సార్లు విజయవంతంగా రవాణా చేశారు. ఈసారి ఏకంగా 200 కిలోల ఆర్డర్ కోసం వసంత జాదవ్ తన బ్యాంకు ఖాతా నుంచి ఒడిశాలోని చిత్రకొండ ఎస్బీఐలో ఉన్న సప్లయర్ అకౌంట్‌కు రూ.90 వేలు పంపగా, అమోల్ మరో లక్ష రూపాయలను వేరే వ్యక్తుల ఖాతాల ద్వారా బదిలీ చేసి ఫోన్‌లో డేటా డిలీట్ చేశాడు. ఈ సరుకును మహారాష్ట్రలోని ప్రభుకు అప్పగిస్తే.. వసంత, అమోల్‌లకు చెరో రూ.10 లక్షలు ముట్టేలా పక్కా ప్లాన్ వేశారు. ఆ డబ్బుతో ఇతర రవాణా ఖర్చులు, గ్యాంగ్ సభ్యులకు వాటాలు చెల్లించాల్సి ఉంది. కానీ ఈగల్ ఫోర్స్ ఎంట్రీతో వీరి ఆట కట్టింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## 18న సెప్టెంబర్ శ్రీవారి దర్శన కోటా విడుదల

తిరుమల, జూన్ 13 (ఈవార్తలు): తిరుమల వేంకటేశ్వర స్వామి వివిధ దర్శనాలు, గదులకు సంబంధించి సెప్టెంబర్ నెలకు సంబంధించి కోటా వివరాలను టీటీడీ వెల్లడించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని టీటీడీ వివరించింది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయని వివరించారు. 22న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 22న మధ్యాహ్నం 3 గంటలకు , 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు , ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేస్తామని వెల్లడించారు. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను విడుదల చేస్తామని వివరించారు.

## మీనాక్షీపై నమోదైన పిటిషన్ వాపస్



హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఊరట లభించింది. ఆమెపై దాఖలైన పిటిషన్‌ను కోర్టు వాపస్ చేసింది. దీనిపై నాంపల్లిలోని నాలుగో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ఆమె రాజ్యసభ సీటు కోసం దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు కారణమైన కేసు విచారణ ముగిసింది. అంతకు ముందు ప్రతివాదుల తరఫున కాంగ్రెస్ లీగల్‌సెల్ అడ్వకేట్ రవిశంకర్ జంధ్యాల కోర్టులో వాదనలు వినిపించారు. పిటిషనర్ దాఖలు చేసిన సమయంలో ప్రత్యర్థులుగా ఉన్నవారు వివిధ హోదాల్లో ఉన్నారని, వారి హోదాలను పరిగణిస్తే మెజిస్ట్రేట్ కోర్టుకు విచారించే అర్హత లేదని, ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తున్న వారిపై ఈ పిటిషన్ చెల్లదని తెలిపారు. ప్రతివాదుల తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించిన కోర్టు ఆ పిటిషన్‌ను వాపస్ చే సింది. ప్రజాప్రతినిధుల కోర్టులో దాఖలు చే సుకొనే అవకాశం ఉంటుందని సూచించింది. నిరుడు మే నెలలో తనపై లైంగిక దాడి జరిగినట్టు పిటిషనర్ శివకుమార్‌రెడ్డిని ప్రధాన ప్రతివాదిగా జోడించింది. చిట్టెం పర్ణికారెడ్డి, బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ (ఎమ్మెల్సీ). మీనాక్షి నటరాజన్, వాకిటి శ్రీహరి (మంత్రి), ప్రశాంత్‌రెడ్డి, చిట్టెం అభిజయ్‌రెడ్డిని ప్రతివాదులుగా తన పిటిషన్‌లో పేర్కొన్నది. తన పిటిషన్‌ను కోర్టు వాపస్ మాత్రమే చేసిందని, ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించి మరోసారి పిటిషన్ దాఖలు చేస్తానని పిటిషనర్ మీడియాకు వెల్లడించారు. తనకు న్యాయం జరిగే వరకూ న్యాయపోరాటం చేస్తానని ఆమె ప్రతినబూనారు. తన వల్ల మీనాక్షీ నటరాజన్‌కు రాజ్యసభ సీటు పోలేదని చెప్పారు.

## లండన్ భారత కమిషన్‌లో ఘనంగా తెలంగాణ వేడుకలు

లండన్: లండన్‌లోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో తెలంగాణ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను సెంట్రల్ లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యూకే సంస్థ తెలంగాణ సంస్కృతి ప్రతిభింబం చేలా ప్రత్యేక నృత్య ప్రదర్శన , హాజరైన అతిథులకు హైదరాబాద్ బిర్యానీని రుచి చూపించారు. కార్యక్రమంలో ముందుగా లండన్‌లోని భారత హైకమిషనర్ పెరియసామి కుమారన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు, ప్రవాసులకు తెలంగాణ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవాసుల్లో ఐక్యత , విదేశీ గడ్డ పై భారత సంస్కృతిని ప్రచారం చేయడానికి వివిధ రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలను భారత హైకమిషన్ అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా టాక్ చిన్నారులు తెలంగాణ జానపద , సాంస్కృతిక గీతాలకు నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

## నేడు హైదరాబాద్‌లో సీజేపీ నిరసన

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): కాక్రోచ్ జనతా పార్టీ హైదరాబాద్‌లో భారీ నిరసన ప్రదర్శనకు సమాయత్తమవుతోంది. ఆదివారం ఇందిరా పార్క్ దర్నా చౌక్ వద్ద ఆందోళనకు ప్లాన్ చేసింది. నీట్ పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యా వ్యవస్థలోని అవకతవకలపై నిరసన చేపట్టనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది కాక్రోచ్ జనతా పార్టీ. దీనిలోభాగంగా ధర్నా నిర్వహణకు పోలీసులు అనుమతి ఇచ్చారు. ఈ ఆందోళనలో సోనమ్ వాంగ్ చుక్ పాల్గొంటుండగా, దీనికి యువత భారీగా తరలి వచ్చే అవకాశం ఉంది.

# హెల్త్ కేర్ హబ్‌గా హైదరాబాద్

**ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం.. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు: శ్రీధర్ బాబు**



హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో... క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు... హైదరాబాద్ ను ఒక ల్యాంచ్ ప్యాడ్ తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా... కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్ కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్ లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్ కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్ ను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

# ఉపాధి పథకంపై తెలంగాణ అభ్యంతరం

**కేంద్రానికి లేఖ రాయాలని సీతక్క నిర్ణయం**



హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన వీబీజీ రాంజీ స్కీంపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ కొత్త విధానాన్ని వ్యతిరేకిస్తూ.. కేంద్రానికి అధికారికంగా నిరసన లేఖ రాయాలని నిర్ణయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంపై లేఖలో పొందుపరచాల్సిన అంశాలపై మంత్రి సీతక్క జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనిదినాల కేటాయింపును డిమాండ్ ఆధారంగా కాకుండా, నార్మేటివ్ విధానంలో చేయడం వల్ల రాష్ట్రానికి ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులకు విరామం ఇవ్వాలనే కేంద్రం నిబంధనను మంత్రి సీతక్క తప్పుబట్టారు. తెలంగాణలో పంటల సీజన్‌లోనే వర్షాలు కురుస్తాయని, ఇదే సమయంలో మొక్కలు నాటడం, వనమహోత్సవం వంటి పనులు జరుగుతాయని తెలిపారు. ఈ సమయంలో 60 రోజుల విరామం ఇస్తే, కేంద్రం చేపట్టిన గ్రీన్ ఇండియా లక్ష్యాలు దెబ్బతింటాయని సీతక్క స్పష్టం చేశారు. కొండ ప్రాంతాల్లో పంటల సీజన్ 60 రోజుల పాటు ఉండదని, అక్కడ ఈ నిబంధన ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, నిర్మాణాలు పూర్తయ్యే వరకు పూర్తి నిధులను కేంద్రమే భరించాలని సీతక్క డిమాండ్ చేశారు. కొత్త విధానం అమలును వాయిదా వేయాలని కోరతామని చెబుతూనే, ఒకవేళ అనివార్య పరిస్థితుల్లో ఈ స్కీంను అమలు చేయాల్సి వస్తే, ఉపాధి కూలీలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి సీతక్క భరోసానిచ్చారు. దీనికి సంబంధించిన ముసాయిదా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గంతో చర్చించిన అనంతరం, ఈ పథకం పై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ స్కీంను వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సర్కారు విఫలం: బొత్స

విశాఖపట్నం, జూన్ 13 (ఈవార్తలు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. శనివారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

కామారెడ్డి, జూన్ 13 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

## అంగన్వాడీలకు సీతక్క గుడ్ న్యూస్

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.

## 10కి చేరిన విశాఖ స్టీల్ ప్లాంట్ మృతులు

విశాఖపట్నం, జూన్ 13 (ఈవార్తలు): ఈనెల 8న విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 10కి చేరుకుంది. శనివారం పెదగంట్యాడలోని సీతానగరం ప్రాంతానికి చెందిన గోకివాడ సూరిబాబు సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్‌లో ఉక్కుద్రవం లీకై ప్రమాదం జరగగా ఘటన ప్రాంతంలోనే 8 మంది చనిపోగా మరుసటి పైడిరాజు అనే కార్మికుడు మృతి చెందాడు. మరో 8 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు.

## ప్రియుడితో కలిసి వివాహిత ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన**

నాగర్ కర్నూల్, జూన్ 13 (ఈవార్తలు): నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గతంలో ప్రేమించుకున్న ఓ వివాహిత, ఆమె ప్రియుడు కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో ఒకే చెట్టుకు ఉరివేసుకుని ఇద్దరూ ప్రాణాలు విడిచారు. శనివారం ఉదయం ఈ దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన రేణుక (23), శివ (25) గతంలో ప్రేమించుకున్నారు. అయితే, వీరి వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో, రెండేళ్ల క్రితం రేణుకకు మరొకరితో వివాహం జరిగింది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. ఇటీవల రేణుక తన ప్రియుడు శివతో ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని గమనించిన భర్త ఆమెను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రేణుక వారం రోజుల క్రితమే పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చిన్నారి ఏడుపు విని నిద్రలేచిన కుటుంబ సభ్యులు, ఇంట్లో రేణుక కనిపించకపోవడంతో ఆందోళన చెంది పరిసర ప్రాంతాల్లో గాలించారు. శనివారం తెల్లవారిన తర్వాత గ్రామ శివారులోని మామిడి తోటలో రేణుక, శివ ఒకే చెట్టుకు ఉరివేసుకుని విగతజీవులుగా కనిపించారు. ఈ హృదయవిదారక ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో తుమ్మల వాంగ్మూలం నమోదు

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శనివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# పెరగనున్న వడ్డీరేట్లు?

## ద్వితీయార్థంలో 50-75 బేసిస్ పాయింట్లు పెరిగే చాన్స్



### ఐసీఐసీఐ గ్లోబల్ మార్కెట్స్ అంచనా

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధం ఓవైపు.. మరోవైపు కరువు భయాల నేపథ్యంలో.. ఈ ఏడాదిలోనే =దీ× వడ్డీరేట్లను పెంచే అవకాశం ఉందని ఐసీఐసీఐ గ్లోబల్ మార్కెట్స్ అంచనా వేసింది. దీంతో లోన్లు తీసుకున్న వారిపై వడ్డీ భారం మరింత పెరిగే అవకాశం ఉందని నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం ఆర్‌బీఐ రెపోరేటు 5.25 శాతం ఉండగా.. ఈ ఏడాది ద్వితీయార్థంలో వడ్డీరేట్లు 50-75 బేసిస్ పాయింట్లు పెరగవచ్చని నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బణంపై కూడా నివేదిక షాకింగ్ విషయాలు వెల్లడించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో దేశీయ ద్రవ్యోల్బణం 5.0కి చేరుకునే ప్రమాదం ఉందని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ తన నివేదికలో పేర్కొంది. ఆహారం, ఇంధనం మినహా.. కోర్ ద్రవ్యోల్బణం 4.6 గా నమోదు కావొచ్చని అంచనా వేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న రుతుపవనాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తవచ్చని నివేదిక స్పష్టం చేసింది. ఇప్పటికే 16 నెలల గరిష్టానికి ద్రవ్యోల్బణం చేరిందని ఐసీఐసీఐ బ్యాంక్ నివేదిక తెలిపింది. ఏప్రిల్ నెలలో 3.48 శాతంగా ఉన్న వినియోగదారుల ధరల సూచీ.. మే నెలకు 3.94 శాతానికి పెరిగిందని, ఇది ముందు అంచనా వేసిన 4.05 శాతానికి తక్కువైనప్పటికీ.. మార్కెట్లో మాత్రం ధరల ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. పశ్చిమ ఆసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ముడిసరుకు ఖర్చులు, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, ఈ ఏడాది రుతుపవనాలు దీర్ఘకాలిక సగటు (ూూూ) కంటే 10 శాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉండటం ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచేలా చేస్తోంది. వర్షాధార పంటలైన తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిపై ఈ ప్రభావం పడే ప్రమాదం ఉంది. అయితే, నీటి పారుదల సౌకర్యాలు మరియు తగినంత నిల్వలు ఉండటం వల్ల వరి, గోధుమ వంటి ప్రధాన ధాన్యాలకు పెద్దగా ముప్పు ఉండకపోవచ్చని నివేదిక తెలిపింది. దేశంలో గత ఐదు నెలలుగా తగ్గుతూ వచ్చిన కూరగాయల ధరలు మే నెలలో ఒక్కసారిగా పెరిగాయి. తీవ్రమైన ఎండల కారణంగా మే నెలలో కూరగాయల ద్రవ్యోల్బణం 10 నెలల గరిష్ట స్థాయి అయిన 5.7 శాతానికి చేరింది. ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో టమాటాల ధరలు 26 శాతం, క్యాలీఫ్లవర్ 12 శాతం, క్యాబేజీ 11 శాతం, బంగాళాదుంపలు 4.5 శాతం మేర పెరిగాయి. వీటితో పాటు కోడిగుడ్లు (2.6%), రెడీమేడ్ ఉత్పత్తులు (1.5%), పాలు-పాల ఉత్పత్తులు (0.9%), వంట నూనెలు (0.8%) కూడా ఖరీదైనవిగా మారాయి. గతేడాదితో పోల్చితే వంట నూనెలు, తాజా మాంసం ధరలు 9.5 శాతం, పండ్లు-జీడిపప్పు వంటివి 8.2 శాతం, చేపలు-సముద్ర ఆహారం 7.5 శాతం పెరిగాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల వల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ (ూ+), సీఎన్‌జీ (జచీ+) మరియు కిరోసిన్ ధరలు పెరిగి ఇంధన ద్రవ్యోల్బణం ఊపందుకుంది. అలాగే రెస్టారెంట్ సర్వీసులు (5.7%), దుస్తులు-పాదరక్షలు (3.0%), గృహోపకరణాల (1.9%) ధరలు పెరగడంతో జ్యువెలరీ మినహాయించిన కోర్ ద్రవ్యోల్బణం 2.2 శాతం నుండి 2.4 శాతానికి పెరిగింది. ఎల్ నినో ప్రభావం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఆహార ధరల పెరుగుదల వంటి సవాళ్లు ఉన్నప్పటికీ... ఆర్‌బీఐ అంచనా వేసిన 5.1 శాతం కంటే స్వల్పంగా తక్కువగా, అంటే రానున్న ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణం 5.0 శాతంగా నమోదు కావచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ అంచనా వేసింది. చమురు ధరల్లో ఇటీవల కనిపిస్తున్న స్వల్ప తగ్గుదల ఊరటనిచ్చే అంశమే అయినప్పటికీ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గకపోతే వడ్డీ రేట్ల పెంపు తప్పకపోవచ్చని స్పష్టం చేసింది.

# భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత స్థానమివ్వాలి

### ఐఏఈఏ చీఫ్ రాఫెల్ మరియానో గ్రాస్సీ



జెనీవా: ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయాలు వేగంగా మారుతున్న తరుణంలో.. అంతర్జాతీయ వేదికపై భారత్‌కు అరుదైన మైలేజ్ లభించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్ అత్యంత సహేతుకమైనదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) అధినేత రాఫెల్ మరియానో గ్రాస్సీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి తదుపరి సెక్రటరీ జనరల్ రేసులో అత్యంత కీలక అభ్యర్థిగా ఉన్న గ్రాస్సీ.. వియన్నాలో ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ అణు పర్యవేక్షణ సంస్థ అధినేతగా, సుదీర్ఘ అనుభవం ఉన్న అంతర్జాతీయ దౌత్యవేత్తగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు భద్రతా మండలి విస్తరణపై భారత్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి బలమైన మద్దతుగా నిలిచాయి. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణాన్ని మార్చాల్సిన అవసరాన్ని రాఫెల్ గ్రాస్సీ బలంగా సమర్థించారు. "భారత్ లాంటి దేశాలు ఈ రకమైన ఆకాంక్షను కలిగి ఉండటం కేవలం సహేతుకం మాత్రమే. ఎందుకంటే 1945 నాటి ప్రపంచం వేరు, ప్రస్తుత 2026 నాటి ప్రపంచం వేరు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణం పాతబడిపోయిందని, సమకాలీన వాస్తవాలకు అనుగుణంగా తక్షణ సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో చెప్తున్న వాదనతో ఆయన ఏకీభవించారు. అయితే ఒక దౌత్యవేత్తగా సమతుల్యతను పాటిస్తూ.. ఐరాస సెక్రటరీ జనరల్ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని.. ఎవరికి సభ్యత్వం ఇవ్వాలనేది సభ్య దేశాల మధ్య విస్తృతమైన ఒకకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. కానీ అధికారిక సభ్యత్వంతో సంబంధం లేకుండానే నేడు ప్రపంచంలో భారత్ ప్రభావం, ఆర్థిక, భౌగోళిక రాజకీయ బలం ఎవరూ తిరస్కరించలేని విధంగా పెరిగిందని ఆయన కొనియాడారు. ప్రస్తుత యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రెండో విడత పదవీ కాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. దీంతో 2027 జనవరి నుంచి కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేసులో రాఫెల్ గ్రాస్సీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే ఈసారి ఐరాస చరిత్రలోనే మొదటి సారిగా ఒక మహిళా నేతకు ఈ అత్యున్నత పీఠాన్ని అప్పగించాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్, సీనియర్ ఐరాస అధికారి రెబెకా గ్రీన్‌స్పాన్ వంటి మహిళా నేతలు ఈ రేసులో ఉన్నారు. అయినప్పటికీ.. అంతర్జాతీయ సంక్షోభాలను పరిష్కరించడంలో గ్రాస్సీకి ఉన్న అనుభవం ఆయన్ను రేసులో ముందంజలో ఉంచింది. 2019 నుంచి ఐఏఈఏ అధినేతగా ఉన్న ఆయన.. ఇరాన్ అణు సంక్షోభంలో దౌత్యమే ఏకైక మార్గమని నొక్కిచెప్పడంతో పాటు ఉక్రెయిన్ యుద్ధ సమయంలో జపోరిజిఝియా అణు కర్మాగారం వద్ద అణు భద్రతను పర్యవేక్షించడంలో కీలక మధ్యవర్తిగా వ్యవహరించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

# ఐఐటీలో పునర్జన్మలపై సదస్సు

### డైరెక్టర్‌ను తొలగించాలని శాస్త్రవేత్తల డిమాండ్



మండీ: ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఐఐటీ-మండీ తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఈ విద్యాలయంలో పునర్జన్మ, జ్యోతిష్యం వంటి అంశాలపై సదస్సు నిర్వహించడంపై దేశవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది నకిలీ సైన్స్‌ను ప్రోత్సహించడమేనని మండిపడ్డారు. ఐఐటీ-మండీ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మీధర్ బెహెరాను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర విద్యాశాఖకు ఒక బహిరంగ లేఖ రాశారు. "పునర్జన్మ, జ్యోతిష్యం వంటి నకిలీ సైన్స్‌ను తిరస్కరించండి" అనే శీర్షికతో ఈ లేఖను విడుదల చేశారు. ఐఐటీ-మండీలోని 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ అండ్ మెంటల్ హెల్త్ అప్లికేషన్స్' సెంటర్ ఆధ్వర్యంలో జూన్ 3 నుంచి 6 వరకు 'మైండ్, బ్రెయిన్ అండ్ కాన్షియస్‌నెస్ కాన్ఫరెన్స్ 2026' జరిగింది. ఈ సదస్సులో పునర్జన్మ, శరీరం నుంచి ఆత్మ బయటకు రావడం (అవుట్-ఆఫ్-బాడీ ఎక్స్‌పీరియన్సెస్), మరణానికి దగ్గరగా వెళ్లిన అనుభవాలు, మరణానంతర సంభాషణలు వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. కొందరు విద్యార్థులు, ఫ్యాకల్టీ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయడంతో వివాదం మరింత ముదిరింది. ఈ అంశాలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని, మతపరమైన సంస్థలతో సంబంధం ఉన్న కొందరు వక్తలుగా పాల్గొన్నారని శాస్త్రవేత్తలు తమ లేఖలో ఆరోపించారు. జ్యోతిష్యం కూడా నిరాధారమైనదని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాల్లో జ్యోతిష్కుల అంచనాలు యాదృచ్ఛికం కంటే మెరుగ్గా లేవని తేలిందని వారు స్పష్టం చేశారు. ఐఐటీ-మండీ డైరెక్టర్‌తో పాటు ఐఐటీ-కాన్పూర్ ప్రొఫెసర్ కూడా ఒక సెషన్‌కు అధ్యక్షత వహించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. భారతీయ విజ్ఞాన వ్యవస్థల (×ఖూ) పేరుతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో శాస్త్రీయత లేని అంశాలను చొప్పించే ప్రయత్నాలపై ఈ సంఘటన మరోసారి చర్చను రేకెత్తించింది. సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సైన్స్‌తో అనుసంధానించే ప్రయత్నాలకు, నకిలీ సిద్ధాంతాలను ప్రోత్సహించడానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని నిపుణులు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ జోక్యం చేసుకోవాలని శాస్త్రవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌లో విలీనం అంతా అబద్ధం

### కాంగ్రెస్ నుంచి ప్రతిపాదన లేదు: సుప్రియా సూలే

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో ఇటీవల చర్చనీయాంశంగా మారిన ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం) కాంగ్రెస్‌లో విలీనం కానుందన్న ఊహాగానాలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే ఖండించారు. తమ పార్టీకి కాంగ్రెస్ నుంచి ఎలాంటి విలీన ప్రతిపాదన రాలేదని, తమ తరఫున కూడా అలాంటి ప్రతిపాదన పంపలేదని స్పష్టం చేశారు. ఈ చర్చ ఎక్కడి నుంచి మొదలైందో తనకు తెలియదన్నారు. పార్టీ అధినేత శరద్ పవార్‌కు కూడా కాంగ్రెస్ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మధ్య జరిగిన సమావేశం నేపథ్యంలో కూడా విలీనాలపై జాతీయ స్థాయిలో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఆ భేటీలో ఏం చర్చించారో తనకు తెలియదని సూలే పేర్కొన్నారు. ఆ సమావేశంలో ఆ ఇద్దరు నేతలు మాత్రమే ఉన్నారని, అందులో విలీనానికి సంబంధించిన అంశాలు చర్చించారా లేదా అనే విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. దేశ ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ లెక్కల కంటే ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూలే అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతి, పరీక్షల ప్రశ్నాపత్రాల లీకుల వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. దేశం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఇలాంటి సమయంలో రాజకీయాలు కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీట్ పరీక్ష వ్యవహారంతో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని అన్నారు. అధికార కూటమిపై కూడా సూలే విమర్శలు గుప్పించారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగంతో రైతులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. కుటుంబాలను చీల్చడం, రాజకీయ పార్టీలను విభజించడం వంటి రాజకీయాలు తమ పార్టీ ఎప్పుడూ చేయలేదని వ్యాఖ్యానించారు.

# యంగెస్ట్ ఐరన్ వుమన్‌గా ఐఐటీ మద్రాస్ విద్యార్థిని

చెన్నై: భారత క్రీడా రంగంలో ఓ యువ సంచలనం సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 20 ఏళ్ల వయసులోనే ఐఐటీ మద్రాస్ విద్యార్థిని రేనీ నొరోన్హా, 'భారతపు అతి పిన్న వయస్కురాలైన మహిళా ఐరన్‌మ్యాన్'గా అరుదైన ఘనత సాధించింది. పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ, ఆమె నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో జరిగిన 'సెంచరీ ట్యూనా ఐరన్‌మ్యాన్' పోటీలో రేనీ తన సత్తా చాటింది. 18-24 ఏళ్ల వయసు కేటగిరీలో 15 గంటల 55 నిమిషాల 37 సెకన్లలో రేసును పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయంతో 2026లో హవాయిలో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఐరన్‌మ్యాన్ అనేది 3.8 కిలోమీటర్ల స్విమ్మింగ్, 180 కిలోమీటర్ల సైక్లింగ్, 42.2 కిలోమీటర్ల మారథాన్‌తో కూడిన అత్యంత కఠినమైన పోటీ. రేనీ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి కాదు. 2023లో 18 ఏళ్ల 49 రోజుల వయసులోనే న్యూజిలాండ్‌లో ఐరన్‌మ్యాన్ రేసును పూర్తి చేసి, ఈ పోటీని ముగించిన అతి పిన్న వయస్కురాలైన భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది. ఒకప్పుడు ప్రొఫెషనల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్‌గా రాణించిన ఆమె, 16 ఏళ్ల వయసులో క్రీడల వైపు అడుగులు వేసింది. ప్రస్తుతం లండన్‌లో ఉంటూనే ఐఐటీ మద్రాస్‌లో బీఎస్సీ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ కోర్సును రిమోట్ విధానంలో చదువుకుంటోంది. 21 ఏళ్లు నిండకముందే ఆరు ఖండాల్లో ఐరన్‌మ్యాన్ పోటీలను పూర్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పడమే తన లక్ష్యమని రేనీ చెబుతోంది. చదువు, క్రీడలు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ఆమె సాధిస్తున్న విజయాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి.

# టాటా ఐఫోన్ ప్లాంట్ మూసేస్తాం!

### వ్యర్థజలాలతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని ఫిర్యాదు

**కాలుష్య నియంత్రణ మండలి కొరడా**

హోసూర్: ప్రముఖ టాటా గ్రూప్‌కు చెందిన ఐఫోన్ విడిభాగాల తయారీ కర్మాగారానికి తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి షాక్ ఇచ్చింది. తమిళనాడులోని హోసూరులో ఉన్న ఈ ప్లాంట్ నుంచి వెలువడుతున్న వ్యర్థజలాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆరోపిస్తూ నోటీసులు జారీ చేసింది. ప్లాంట్‌ను ఎందుకు మూసివేయకూడదో సరైన వివరణ ఇవ్వాలని, లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించింది. స్థానిక రైతుల నుంచి కొన్ని నెలలుగా వస్తున్న ఫిర్యాదులతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రంగంలోకి దిగారు. డిసెంబర్ 2025 నుంచి మే 2026 మధ్య ఐదుసార్లు ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్టరీలోని వ్యర్థ జలాలను వర్షపు నీటి సంరక్షణ చెరువులోకి వదిలారని, అది పొంగిపొర్లి సమీప వ్యవసాయ భూములు, బావుల్లోని నీటిని కలుషితం చేసిందని మే 25న జారీ చేసిన నోటీసులో మండలి పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాలను కూడా టాటా పాటించలేదని తెలిపింది. అయితే, ఈ ఆరోపణలను టాటా ఎలక్ట్రానిక్స్ తోసిపుచ్చింది. తమ ప్లాంట్‌లో అన్ని నిబంధనలు పాటిస్తున్నామని, గుర్తింపు పొందిన స్వతంత్ర ల్యాబ్‌లో చేయించిన పరీక్షల్లో ఇది రుజువైందని ఒక ప్రకటనలో తెలిపింది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, అధికారులకు ఇప్పటికే వివరణ ఇచ్చామని స్పష్టం చేసింది. చైనాకు ప్రత్యామ్నాయంగా యాపిల్ సంస్థ తమ ఐఫోన్ల తయారీని భారత్‌కు తరలిస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. 2026 నాటికి ప్రపంచ ఐఫోన్లలో 26% భారత్‌లోనే తయారవుతాయని అంచనా. ఈ విషయంపై స్పందించేందుకు యాపిల్, తమిళనాడు ప్రభుత్వ వర్గాలు నిరాకరించాయి.

# బీజేపీకి టీవీకే జిరాక్స్ కాపీ: స్టాలిన్



చెన్నై: తమిళనాడులో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం, ముఖ్యమంత్రి విజయ్ తీరుపై డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టీవీకే సర్కార్ బీజేపీకి 'జిరాక్స్ కాపీ'లా మారిందని, అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కొనుగోలు చేస్తూ ప్రతిపక్షాన్ని బలహీనపరిచే కుట్రకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. శనివారం చెన్నైలోని అన్నా అరివాలయంలో జరిగిన డీఎంకే మహిళా విభాగం సమావేశంలో స్టాలిన్ ప్రసంగించారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక వ్యూహాలనే తమిళనాడులో టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి విజయ్ అన్నాడీఎంకే ఎమ్మెల్యేల కోసం 'షాపింగ్' చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికలు ముగిసి 21 రోజులు కూడా గడవకముందే, వేలికి ఉన్న సిరా గుర్తు చెరగకముందే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారని, వారికి ఎలాంటి ఆఫర్ ఇచ్చి చేర్చుకున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత అంశాన్ని ప్రస్తావిస్తూ, శ్రీవైకుంఠంలో జరిగిన ఒక లైంగిక వేధింపుల ఘటనను స్టాలిన్ ఉదహరించారు. ఈ కేసులో బాధితురాలు టీవీకే సభ్యురాలైతే, నిందితులు కూడా అధికార పార్టీకి చెందిన వారని ఆయన ఆరోపించారు. అయితే, నిందితులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితురాలినే పార్టీ నుంచి తొలగించడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. టీవీకే కార్యకర్తల నుంచి మహిళలకు రక్షణ కల్పించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు.

# మమతకు సన్నిహితుడి షాక్

### కేంద్ర మంత్రి భూపేందర్‌తో సుదీప్ బందోపాధ్యాయ భేటీ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తీవ్రతరమవుతోంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడు, సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ సమావేశంలో తిరుగుబాటు ఎంపీ శతాబ్ది రాయ్ సైతం పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీకి చెందిన సుమారు 20 మంది లోక్‌సభ సభ్యులు తమను ప్రత్యేక బృందంగా గుర్తించాలని కోరుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీఎంసీ ఓటమి పాలవగా, బీజేపీ నేత సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో మొదలైన విభేదాలు ఇప్పుడు పార్లమెంటు స్థాయికి చేరాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు, బీజేపీలో విలీనం కాకుండానే ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని తిరుగుబాటు వర్గం భావిస్తోంది. కాకోలీ ఘోష్ దస్తీదార్ వంటి నేతల నేతృత్వంలో తామే అసలైన టీఎంసీ అని ఈ వర్గం వాదిస్తోంది. తిరుగుబాటు ఎంపీ జగదీష్ బసునియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ బృందం ఆదివారం ఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని, సోమవారం (జూన్ 15న) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనుంది. సభలో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని వారు స్పీకర్‌ను కోరనున్నారు.



# వాయుసేన విమానం క్రాష్

### ఐదుగురు రక్షణ సిబ్బంది మృతి

గౌహతి: అసోంలోని జోర్‌హట్ ఎయిర్‌బేస్ వద్ద శనివారం ఉదయం భారత వాయుసేన రవాణా విమాన ప్రమాదం కూలిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర విషాదం నెలకొన్నట్లు తెలుస్తుంది. ఎయిర్‌బేస్‌లో ల్యాండింగ్ అవుతున్న సమయంలో వాయుసేనకు చెందిన ఏఎన్-32 రకం విమానం ఒక్కసారిగా కూలిపోవడంతో జరిగిన ఘోర ప్రమాదంలో ఐదుగురు రక్షణ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఇద్దరు వాయుసేన అధికారులు కాగా, మిగిలిన ముగ్గురు ఇతర విమాన సిబ్బంది ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొక సిబ్బందిని రెస్క్యూ టీమ్స్ తక్షణమే సమీపంలోని సైనిక ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రన్‌వేపై ల్యాండైన తరుణంలో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే విమానం అదుపుతప్పి కూలిపోయి, మంటల్లో చిక్కుకుందని ప్రాథమిక నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణకు వాయుసేన ఉన్నతాధికారులు కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించారు. కాగా ఐదుగురు రక్షణ సిబ్బంది మృతిపై వాయుసేన అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

# అఖిలేష్ కుమార్తెపై ట్రోలింగ్

### కేసు నమోదుకు యోగి ఆదేశాలు

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తన రాజకీయ ప్రత్యర్థి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కుమార్తె అదితి యాదవ్‌పై సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న అనుచిత ప్రచారాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, ఏ కుమార్తెకూ ఇటువంటి అవమానం జరగకూడదని స్పష్టం చేస్తూ, దీనికి బాధ్యులైన వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిర్వహణపై అఖిలేష్ యాదవ్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. భక్తులు సమర్పించిన కోట్లాది రూపాయల విరాళాలు గల్లంతయ్యాయని, ఇది ఆలయ ట్రస్టుకు సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను సాకుగా తీసుకుని కొందరు అఖిలేష్ కుమార్తెను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ ప్రారంభించారు. అదితి యాదవ్ రూ. 7 కోట్లు దొంగిలించి, తన స్నేహితుడితో కలిసి నైజీరియాకు పారిపోయిందంటూ మార్ఫింగ్ చేసిన చిత్రాలు, ఏఐ-జనరేటెడ్ ఫోటోలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారు. దీపిక రస్తోగి అనే నెటిజన్ అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, అఖిలేష్ యాదవ్ కూతురు తన ఇంట్లోనే రూ. 7 కోట్లు అపహరించి నైజీరియాలో ఉంటున్నారని, కానీ మాజీ సీఎం మాత్రం అయోధ్య రామమందిరం నిధుల గురించి మాట్లాడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. అఖిలేష్ కూతురుని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడిని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై కాన్పూర్, ప్రతాప్‌గఢ్‌లలో పోలీసులు ఇప్పటికే పలువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మహిళల గౌరవానికి భంగం కలిగించడం, ఫోర్జరీ వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. శనివారం అజంగఢ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి యోగి మాట్లాడుతూ, "ఈ పోస్టుల గురించి తెలిసిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించాను. ఎవరి కుమార్తె అయినా మన కుమార్తెతో సమానమే. ప్రతి ఆడపిల్ల కూడా మన కూతురు వంటిదే అనే సంస్కారంతో మనం పెరిగాం" అని పేర్కొన్నారు. అదితిని సోషల్ మీడియాలో లక్ష్యంగా చేసుకోవడాన్ని సమాజ్‌వాదీ పార్టీ నేతలు కూడా తీవ్రంగా ఖండించారు.

# ఖాతాలను సైబర్ నేరాలకు ఉపయోగిస్తే జైలు

### ఖాతాదారులకు ఆర్బీఐ కీలక హెచ్చరిక

న్యూఢిల్లీ: మీకు బ్యాంక్ అకౌంట్ ఉంటే చాలు.. చాలా ఈజీగా డబ్బు సంపాదించవచ్చని వచ్చే ఆఫర్లపై ఖాతాదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. ఎవరైనా మీ బ్యాంక్ అకౌంట్ ను ఉపయోగించుకుని కేవలం డబ్బును ఒకరి నుంచి మరొకరికి ట్రాన్స్ఫర్ చేసినందుకు కమీషన్ ఇస్తామని ఆశ చూపితే నమ్మవద్దని సూచించింది. అక్రమంగా సంపాదించిన సొమ్ము లేదా నేరాలకు సంబంధించిన సొమ్మును ఇలా వేరొకరికి అకౌంట్ల నుంచి ట్రాన్స్ఫర్ చేసే వ్యక్తుల్ని మనీ మ్యూల్స్ అంటారు. మీకు తెలియకుండా ఇలాంటి ప్రమాదం ఉందని హెచ్చరించింది.



## నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి

**అడ్వొకేట్ జనరల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, జూన్ 13 (ఈవార్తలు): సిరిసిల్ల జిల్లాకు చెందిన నేరెళ్ల బాధితులకు ఇకనైనా న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నేరెళ్ల బాధితులు కల్వకుంట్ల కవితతో సమావేశమయ్యారు. సిరిసిల్ల జిల్లాలోని మానేరు నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమపై అప్పటి ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును బాధితులు వివరించారు. నేతల పరామర్శలే తప్ప తమకు న్యాయం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కవిత స్పందిస్తూ నేషనల్ ఎస్సీ కమిషన్, తెలంగాణ ఎస్సీ కమిషన్ నేరెళ్ల ఘటనపై విచారణ జరిపి రూపొందించిన నివేదికలు వెలుగు చూసేలా తాము ఒత్తిడి తీసుకువస్తామన్నారు. నేరెళ్ల బాధితులను రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకున్న కాంగ్రెస్, బీజేపీలు వారికి న్యాయం చేయడానికి మాత్రం అందుకు రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచిన తర్వాత కూడా నేరెళ్ల బాధితులకు న్యాయం జరగకపోవడం అత్యంత విచారకరమన్నారు. అడ్వొకేట్ జనరల్ ప్రత్యేక చొరవ తీసుకుని నేరెళ్ల బాధితుల పక్షాన గట్టి వాదనలు వినిపించి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేరెళ్ల బాధితులు కోల హరీశ్, పెంట బానయ్య వారి కుటుంబ సభ్యులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**టీఆర్ఎస్ కు నేరెళ్ల బాధితుడి విరాళం**

తెలంగాణ రక్షణ సేన పార్టీకి నేరెళ్ల బాధితుడు పెంట బానయ్య విరాళం ఇచ్చారు. శనివారం పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవితకు రూ.10 వేల విరాళం అందజేశారు. తమ పక్షాన గొంతు విప్పి న్యాయం చేయాలని కల్వకుంట్ల కవిత కోరుతున్నారు.. ఆమె స్థాపించిన టీఆర్ఎస్ పార్టీకి తన వంతు సాయంగా విరాళం అందజేశానని చెప్పారు.



## మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఐఎంఏ ముందడుగు

**యాంటీ డ్రగ్ 3కే రన్ కరపత్రం ఆవిష్కరణ**

**యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

జగిత్యాల, జూన్ 13 (ఈవార్తలు): మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్ 3కే రన్" కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందన్నారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించడంలో వైద్యులు ముందుండడం ప్రశంసనీయమన్నారు. "రన్ స్ట్రాంగ్ -- లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్" నినాదంతో నిర్వహించనున్న 3కే రన్ పాత బస్టాండ్ సమీపంలోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుంచి ఐఎంఏ భవనం వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని పిలుపునిచ్చారు. ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్‌కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్‌కుమార్, డాక్టర్ బండెల విజయ్, డాక్టర్ ఇనుగుర్తి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

**కాలిపోయిన ఇంటిని పరిశీలించిన జీవన్‌రెడ్డి**

**రూ.10 లక్షల సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

జగిత్యాల టౌన్, జూన్ 13 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయిన రాచర్ల గంగాధర్ ఇంటిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పరిశీలించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి పరామర్శించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, గంగాధర్ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. కుట్టుమిషన్ల మరమ్మతులు, దుస్తుల కుట్టు పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారని చెప్పారు. అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు సుమారు 60 కుట్టుమిషన్లు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు. ప్రమాదంలో రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తనకు ఫోన్‌లో వివరించినట్లు తెలిపారు. బాధిత కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. రాజీవ్ యువ వికాస్ పథకం కింద రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి కుటుంబానికి ఉపాధి కల్పించాలని, పూర్తిగా కాలిపోయిన ఇంటి స్థానంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు.

# సింగరేణికి రూ.9,647 కోట్ల నష్టం

**బీఆర్ఎస్, బీజేపీ విధానాలే కారణం: భట్టి**

**డిప్యూటీ సీఎంకు అడ్లూరి ఘన స్వాగతం**



ధర్మపురి, జూన్ 13 (ఈవార్తలు): ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్తున్న సందర్భంగా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల కారణంగా సింగరేణి సంస్థకు రూ.9,647 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.1.25 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి భట్టి విక్రమార్క పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దండేపల్లి మండలం గూడెం గుట్టలో రూ.70 కోట్లతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సింగరేణిలో ఉద్యోగాలు పొందిన 335 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణకు చెందిన బొగ్గు బ్లాకుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల సింగరేణికి భారీ నష్టం జరిగిందని భట్టి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా రాష్ట్రంపై ఆర్థిక భారం పెరిగిందని, ప్రతి నెలా వేల కోట్ల రూపాయలు వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొనగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# 47 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**రూ.17.72 లక్షల ఆర్థిక సాయం అందజేత**

**అభివృద్ధి పనులకు నిధుల మంజూరు పత్రాల పంపిణీ**



మెట్‌పల్లి, జూన్ 13 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలోని జువ్వాడి భవన్‌లో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్‌రావు పంపిణీ చేశారు. మొత్తం 47 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల 72 వేల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం మెట్‌పల్లి పట్టణంలోని గంగపుత్ర సంఘం అభివృద్ధి పనులకు, కోరుట్ల పట్టణంలోని పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి, ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో గంగపుత్ర సంఘం అభివృద్ధి పనులతో పాటు గ్రామ శ్మశానవాటిక సమీపంలో రెండు బోర్ల ఏర్పాటు కోసం ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరు చేసి సంబంధిత ప్రొసీడింగ్స్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ చైర్మన్లు, మెట్‌పల్లి వైస్ చైర్మన్, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ కౌన్సిలర్లు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రామాలయంలో చోరీ.. దొంగలు దొరికారు!


**ఇద్దరి అరెస్టు.. 13 తులాల వెండి స్వాధీనం**

సారంగాపూర్, జూన్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ గ్రామంలోని రామాలయంలో జరిగిన వెండి కిరీటాల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించి న మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సారంగాపూర్ ఎస్ఐ పి. గీత తెలిపారు. ఈ ఏడాది మే 25న రామాలయంలోని వెంకటేశ్వరస్వామికి చెందిన రెండు వెండి కిరీటాలు (సుమారు 15 తులాలు) దొంగతనానికి గురయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న సారంగాపూర్ గ్రామానికి చెందిన తునికి గంగాచారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మద్యం వ్యసనానికి బానిసైన తాను డబ్బుల కోసం దొంగతనానికి పాల్పడినట్లు గంగాచారి ఒప్పుకున్నాడు. రామాలయంలోని రెండు వెండి కిరీటాలను దొంగిలించి, జగిత్యాలకు చెందిన కట్టా లక్ష్మణాచారి సహాయంతో వాటిని ముక్కలుగా కట్ చేసినట్లు తెలిపాడు. అనంతరం వాటిని కరిగించి కొంత వెండిని విక్రయించి వచ్చిన డబ్బుతో మద్యం సేవించినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి 13 తులాల వెండిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, కిరీటాలను కట్ చేయడంలో సహకరించిన వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. దొంగతనాలకు పాల్పడిన వారితో పాటు దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ పి. గీత సూచించారు.



## ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ధర్మపురి, జూన్ 13 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్కిల్ పరిధిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్స్‌కు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సీఐ రామ్ నరసింహారెడ్డిని ఆదేశించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, సామాజిక భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు దిశగా ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తన పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జూన్ 13 (ఈవార్తలు): శనివారం సందర్భంగా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామునే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్షేత్రపాలకుడు బేతలస్వామి వారిని సైతం భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.



## స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు

మల్యాల, జూన్ 13 (ఈవార్తలు: స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు మేరకు మల్యాల, మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ శ్రేణులు పాఠశాలలను శుభ్రం చేశారు. అన్ని గదులను నీటితో కడిగి, పాఠశాల ఆవరణల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బొట్ల ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కట్కం లత, మాజీ ఎంపీటీసీ రాచర్ల రమేశ్, అవుదుర్తి రమ, నీలం రవి, సంగ శంకర్, జిల్లాల రమేశ్, డబ్బు గోవర్ధన్, గుండేటి గంగారాం, గంగిశెట్టి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శబరిమలలో ప్రత్యేక పూజలు

శబరిమల: మిథున మాస పూజల నిమిత్తం కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయం రేపటి (జూన్ 14) నుంచి భక్తుల దర్శనార్థం పునఃప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తంత్రి కందరారు మహేష్ మోహనారు సమక్షంలో రేపు సాయంత్రం 5 గంటలకు మేళ్‌శాంతి ఈ.డి. ప్రసాద్ గర్భగుడి తలుపులు తెరిచి, ఆలయ సంప్రదాయం ప్రకారం దీపారాధన నిర్వహిస్తారు. ఈ నెలవారీ ప్రత్యేక పూజలు జూన్ 19 వరకు కొనసాగనున్నాయి. స్వామివారి దర్శనం కోరుకునే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ వర్చువల్ క్యూ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. భక్తులు తమ స్లాట్‌లను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. జూన్ 19వ తేదీ రాత్రి ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం భక్తులకు వీడ్కోలు పలికి తలుపులు మూసివేస్తారు.



ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
ఆదివారం 14-6-2026, జగిత్యాల
www.evarthalu.com


వయ్యారి చిత్రం






## 'లెనిన్' విడుదల వాయిదా

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'లెనిన్' విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ నటుడు కింగ్ నాగార్జున అధికారికంగా ప్రకటించారు. సినిమాను జూలై 10న విడుదల చేయనున్నట్లు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ వాయిదాకు గల కారణాన్ని నాగార్జున స్పష్టంగా వివరించారు. "లెనిన్ చిత్రబృందం నన్ను కలిసి, సినిమాను మరింత ప్రత్యేకంగా, 100 శాతం అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. వారిలోని అభిరుచి, స్ఫూర్తి చూసి నేను అంగీకరించాను" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సినిమాపై అంచనాలు పెంచేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మనోడు జూలై 10న వస్తున్నాడు. నేను మళ్ళీ చెబుతున్నా, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూస్తారు! 'లెనిన్' అనుభవానికి సిద్ధంగా ఉండండి" అంటూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. నాగార్జున ప్రకటనతో సినిమా విడుదల తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. నాణ్యమైన చిత్రాన్ని అందించాలనే లక్ష్యంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

## నవంబర్ నుంచి ఓజీ2 షూటింగ్

ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ ఈ ఏడాది నవంబర్ నెల నుంచి 'ఓజీ 2' షూటింగ్ కోసం తేదీలు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రాజకీయ బాధ్యతలతో పాటు ఇతర కమిట్‌మెంట్లను పూర్తి చేస్తున్న ఆయన,




నవంబర్ నుంచి ఈ ప్రాజెక్ట్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. మొదటి భాగం ప్రధానంగా భారతదేశం నేపథ్యంలో సాగగా, రెండో భాగాన్ని మరింత గ్రాండ్ స్కేల్‌లో తెరకెక్కించేందుకు సుజీత్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి కథలో అంతర్జాతీయ స్థాయి యాక్షన్ ఎపిసోడ్లు ఉండనున్నాయని, అందుకే విదేశాల్లోనూ కీలక షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ కూడా ఈ విదేశీ షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.



## కాశీలో రేణు దేశాయ్ మువీ షూటింగ్

సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుసగా విభిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న రేణు దేశాయ్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ముందుకు వస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఆమె, తాజాగా తన కొత్త సినిమా షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. అడ్వర్టైజింగ్ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన యమునా కిశోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శంకర్ ఇందుచూడన్ హీరోగా నటిస్తున్నారు. ఇందులో రేణు దేశాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఆధ్యాత్మిక నగరం కాశీలో జరుగుతోంది. ఈ సందర్భంగా రేణు దేశాయ్ తన ఆనందాన్ని సోషల్ మీడియా ద్వారా వ్యక్తం చేశారు. దర్శకుడు యమునా కిశోర్‌తో పనిచేయడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోందని, శంకర్ ఇందుచూడన్ వంటి ప్రతిభావంతుడైన నటుడితో కలిసి నటించడం ఉత్సాహాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. అంతేకాకుండా, మహాదేవుడి క్షేత్రమైన కాశీలో షూటింగ్ జరగడం తనకు దైవానుగ్రహంగా భావిస్తున్నట్లు తెలిపారు.

## సోనూసూద్ ఎమోషనల్ పోస్ట్



ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు. అయితే ఈ ప్రయాణంలో రైలు లగ్జరీ సౌకర్యాలను చూసిన ఆయన, ఒక్కసారిగా తన పాత రోజులను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. ఒకప్పుడు నటుడు అవ్వాలనే కలతో ముంబైలో తను పడ్డ కష్టాలు, రైలు ప్రయాణాల అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. భారతీయ రైల్వే సాధించిన ప్రగతి అద్భుతంగా ఉందంటూ సోనూ సూద్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. 'నేను ప్రస్తుతం వందే భారత్ రైలులో ప్రయాణిస్తున్నాను. మన దేశంలో రైల్వేలు ఇంతగా అభివృద్ధి చెందడం నిజంగా గర్వకారణం. ఇక్కడి వసతులు, ఇస్తున్న ఫుడ్, సిబ్బంది ప్రవర్తన, వారు చూపిస్తున్న ప్రేమ అన్నీ చాలా బాగున్నాయి. ఈ ప్రయాణం నా మొదటి రైలు ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చింది. నేను నాగ్‌పూర్‌లో చదువు పూర్తి చేసుకుని, నటుడిని అవ్వాలనే పెద్ద కలతో ముంబైకి బయలుదేరిన రోజులు గుర్తొచ్చాయి. ఆ రోజుల్లో ప్రయాణించడానికి మాకు కనీసం రైలు రిజర్వేషన్ కూడా దొరికేది కాదు. పొడవాటి కంప్యూటర్ పేపర్లను మడతపెట్టుకుని ఎలాగోలా జనరల్ బోగీల్లోకి దూరేవాళ్లం. రాత్రి పూట పడుకోవడానికి చోటు లేక, రైలు టాయిలెట్ దగ్గరే నేలపై పేపర్లు పరుచుకుని పడుకునేవాళ్లం. అలాంటిది, ఇన్నేళ్ల తర్వాత మళ్లీ రైలెక్కితే వ్యవస్థ మొత్తం మారిపోయింది. భారతీయ రైల్వే క్వాలిటీ ఎంతో పెరిగింది. ఇప్పుడు ఎవరూ టాయిలెట్ దగ్గర పేపర్లు వేసుకుని పడుకోవాల్సిన అవసరం లేదు. సామాన్యుల ప్రయాణాన్ని ఇంత సుఖవంతం చేసినందుకు, మన దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు రైల్వే శాఖకు నా ధన్యవాదాలు. ఇలాంటి మంచి పనులను ఇంకా ముందుకు తీసుకెళ్లాలి' అని సోనూసూద్ కొనియాడారు.

## నకిలీ నంబర్‌కు స్పందించొద్దు: మీనాక్షి



'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రోజాతో పోటీ ఉండేది: మీనా



అనేక భాషల్లో సినిమాలు చేసి అద్భుతమైన గుర్తింపును సంపాదించుకున్న సీనియర్ నటి మీనా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తాజాగా ఈమె, మోహన్ లాల్ హీరోగా జీతూ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'దృశ్యం 3' అనే మలయాళ చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమా మలయాళ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. తాజాగా మీనా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన తోటి హీరోయిన్ల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మీనా మాట్లాడుతూ... "నాతో పాటు రమ్యకృష్ణ, రోజా, రంభ, సౌందర్య, నగ్మా వంటి హీరోయిన్లు ఎక్కువ సినిమాల్లో నటిస్తూ ఉండేవారు. అయితే మా అందరిలో నాకు ఎక్కువగా పోటీ రోజాతో ఉండేది. నేను, రోజా చాలాసార్లు సినిమాల విషయంలో పోటీ పడ్డాం. ఏదైనా సినిమాకు నా డేట్స్ అందుబాటులో లేకపోతే నిర్మాతలు రోజాను తీసుకునేవారు. అలాగే రోజా డేట్స్ ఖాళీగా లేకపోతే నన్ను సంప్రదించేవారు. ఇలా మా ఇద్దరి మధ్య గట్టి పోటీ ఉండేది. అయితే మా మధ్య పోటీ ఎప్పుడూ హెల్తీగానే ఉండేది. మేము స్క్రీన్‌పై మాత్రమే పోటీ పడేవాళ్లం. బయట కలిసినప్పుడు మాత్రం ఎంతో సరదాగా గడిపేవాళ్లం. షూటింగ్ గ్యాప్‌లో కలిసి చిన్న చిన్న ఆటలు ఆడేవాళ్లం. వీలు దొరికితే బయటకు వెళ్లి ఫుడ్ కూడా తినేవాళ్లం" అని చెప్పుకొచ్చింది.



## నేను లెస్బియన్ కాదు

బాలీవుడ్ భామ మౌనీ రాయ్ బాలీవుడ్‌లో సుపరిచమైన పేరు. ఇటీవలే ఆమె తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్లు ప్రకటించింది. తామిద్దరం పరస్పర అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించింది. కానీ ఆ తర్వాత మౌనీ రాయ్‌పై పెద్దఎత్తున ట్రోల్స్, విమర్శలు వచ్చాయి. చాలా దారుణంగా కొందరు కామెంట్స్ చేశారు. ఆమెను గే అంటూ రూమర్స్ సృష్టించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన మౌనీ రాయ్ తనపై వచ్చిన రూమర్స్, ట్రోల్స్‌పై స్పందించింది. ఓ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడిన ఆమె.. తనపై గే అన్న రూమర్‌పై రియాక్ట్ అయింది.



## విజయ్ సినిమాలో మాళవిక

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన లక్కీ చాన్స్ కొట్టేస్తున్నారు. ఇటీవల 'ది రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం విలక్షణ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా దర్శకత్వంలో రాబోతున్న 'పాకెట్ నోవెల్' మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వచ్చిన 'సూపర్ డీలక్స్' వంటి కల్ట్ క్లాసిక్ హిట్ తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడంతో ప్రకటన రోజు నుంచే అందరిలోనూ ఆసక్తి మొదలైంది.




# ఎవరితో ఓడినా పాక్‌తో ఓడిపోవద్దన్నాడు!

## వాచ్‌మన్ మాట గుర్తుచేసిన జెమీమా

"ఎవరితో మ్యాచ్‌లో అయినా ఓడిపోవచ్చు కానీ పాకిస్థాన్‌తో మాత్రం ఓడిపోవద్దు" అని తన బిల్డింగ్ వాచ్‌మన్ కూడా తనతో అన్నాడని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఎంతటి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఇదొక నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం (జూన్ 14) పాకిస్థాన్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌తో ఇరు జట్లూ తమ ప్రపంచకప్ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నాయి. ఈ నేపథ్యంలో జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెమీమా మాట్లాడుతూ, "భారత్-పాక్ మ్యాచ్‌ల చరిత్ర, అభిమానుల అంచనాల వల్ల బయటి నుంచి ఒత్తిడి ఉంటుందన్నది వాస్తవం. దీన్ని మనం కాదనలేం" అని హర్మన్‌ప్రీత్ కౌర్ డ్రెస్సింగ్ రూమ్‌లో తమతో చెబుతుంటుందని జెమీమా గుర్తుచేసుకుంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడానికి జట్టు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోందని ఆమె వివరించింది. జట్టు సన్నద్ధతలో కోచ్ అమోల్ మజుందార్ కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిపింది. 2025 వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన స్ఫూర్తితో ఆడతామని వ్యాఖ్యానించింది. ప్రతి మ్యాచ్‌కు విభిన్న వ్యూహాలతో సన్నద్ధమవుతామని వెల్లడించింది. ముఖ్యంగా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒత్తిడిని తట్టుకుని ఎలా రాణించాలో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నామని జెమీమా పేర్కొంది.



# పీవీ సింధు ఓటమి

ఈ ఏడాది తొలి టైటిల్ వేటలో ఉన్న భారత స్టార్ షట్లర్ పి.వి. సింధుకు మరోసారి నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీ ఫైనల్లో టాప్ సీడ్ యమగుచి (జపాన్) చేతిలో సింధు ఓటమిపాలైంది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అయిన మయగుచి చేతిలో 22-20, 21-12 తేడాతో భారత స్టార్ షట్లర్ పరాజయం చవిచూసి ఫైనల్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. తొలి గేమ్‌లో చాలాసేపు సింధు ఆధిక్యంలో నిలిచింది. కానీ, యమగుచి పట్టువదలకుండా పోరాడటంతో 20-20తో స్కోరు సమం అయింది. ఆ తర్వాత యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి జోరు కొనసాగించి సునాయసంగా విజయం సాధించింది.

# వైభవ్ తమ్ముడూ వందేశాడు.. 10 ఏళ్లకే సెంచరీ

15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మొన్న ఐపీఎల్ సందర్భంగా అదర గొట్టిన సంగతి తెలిసిందే. ఆరెంజ్ క్యాప్ గెలుచుకోవడమే కాకుండా, త్వరలో భారత జట్టు తరుపున బరిలోకి దిగనున్నాడు. దీంతో వైభవ్ సూర్యవంశీ పేరు మారుమోగుతోంది. ఇలాంటి నేపథ్యంలో వైభవ్ ఫ్యామిలీ నుంచి మరో టాలెంట్ బయటకు వచ్చింది. వైభవ్ సోదరుడు ఆశీర్వాద్ పదేళ్ల వయసులోనే సెంచరీ కొట్టేశాడు. బీహార్ లో లోకల్ ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా పదేళ్ల బుడ్డోడు ఆశీర్వాద్ సెంచరీ బాదాడు. తాజ్ పూర్ క్రికెట్ అకాడమీ తరఫున 87 బంతుల్లో ఓ సిక్సర్, 20 బౌండరీలు సాధించాడు. ఈ క్రమంలోనే 103 పరుగులు సాధించాడు. తన అన్నలాగా దూకుడుగా కాకుండా.. ఓపికగా బ్యాటింగ్ చేస్తూ, తన సత్తా చాటాడు. ఈ విషయాన్ని అతని సోదరుడు ఉజ్వల్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశాడు. దీంతో ఆశీర్వాద్ ఇన్నింగ్స్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది.







# గిల్ గెలిపించాడు!

## శుభ్‌మన్ కెప్టెన్ ఇన్నింగ్స్.. రాహుల్ మెరుపులు

**ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో, ఆఫ్ఘన్ నిర్దేశించిన 195 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 22.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.**


**కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84 నాటౌట్) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించగా, కేఎల్ రాహుల్ (39 నాటౌట్) తన మెరుపు బ్యాటింగ్‌తో విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.**

195 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు మంచి ఆరంభం లభించింది. రోహిత్ శర్మ (16) వేగంగా ఆడినా రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (34) దూకుడుగా ఆడి స్కోరు బోర్డును నడిపించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఒకవైపు వికెట్లు పడుతున్నా సంయమనంతో ఆడి, 66 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 84 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివర్లో కేఎల్ రాహుల్ కేవలం 19 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 39 పరుగులు చేసి, మరో 13 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు విజయాన్ని అందించాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్ ఖాన్,




జియా ఉర్ రెహ్మాన్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు, టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ ప్రారంభించిన ఆఫ్ఘనిస్థాన్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలినా, ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో 200 స్ట్రైక్ రేట్‌తో విధ్వంసకర శతకాన్ని నమోదు చేశాడు. గుర్బాజ్ తన ఒంటరి పోరాటంతో జట్టు స్కోరును పరుగులు పెట్టించాడు. అయితే, అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (27), అజ్మతుల్లా ఒమర్జాయ్ (26) కాసేపు నిలదొక్కుకున్నా, గుర్బాజ్ ఔటైన తర్వాత అఫ్గాన్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది. భారత యువ బౌలర్ల ధాటికి 24.5 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో యువ ఆటగాళ్లు గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే అద్భుతంగా రాణించి చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అర్ష్‌దీప్ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డిలకు చెరో రెండు వికెట్లు దక్కాయి. ముఖ్యంగా నితీశ్ రెడ్డి.. ప్రమాదకరంగా మారుతున్న గుర్బాజ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇక ఇరు జట్ల మధ్య రెండో వన్డే జూన్ 17న లక్నోలో జరగనుంది.



# పరాగ్వేపై అమెరికా విన్

ఆతిథ్య అమెరికా ఫిఫా వరల్డ్ కప్‌లో శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. ఇప్పటివరకు ఎన్నడూ ఈ ఫీట్‌ను సాధించలేదు. మొదట్నుంచీ దూకుడుగానే ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. మ్యాచ్ ముగిసేనాటికి 4-1 తేడాతో పరాగ్వేను అమెరికా చిత్తు చేసింది. సొంత ప్రేక్షకుల మధ్య అమెరికా చెలరేగింది. పరాగ్వేపై ఎదురుదాడి చేసింది. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఇక ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో అమెరికా ముందు పరాగ్వే నిలవలేకపోయింది. దీంతో తొలి అర్ధభాగం సమయానికే 3-0 ఆధిక్యంలోకి అమెరికా వెళ్లిపోయింది. రెండో హాఫ్‌లో 73వ నిమిషం వద్ద పరాగ్వే ఆటగాడు మౌరిసియో గోల్ కొట్టాడు. దీంతో అమెరికా లీడ్ 3-1కి తగ్గింది. ఆట అదనపు సమయంలో అమెరికా (90౦8 నిమిషాల వద్ద) ప్లేయర్ గివోన్ని రీనా అదిరిపోయే గోల్ కొట్టి.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా 4-1 తేడాతో తన జట్టును గెలిపించాడు. పరాగ్వే (37 శాతం)తో పోలిస్తే బంతిపై నియంత్రణ అమెరికాకే (63 శాతం) ఎక్కువగా ఉంది.

# మాకు సంబంధం లేదు: బీసీసీఐ

ఐపీఎల్‌కు సంబంధించి పలు కీలక అంశాలపై బీసీసీఐ సమీక్ష నిర్వహించింది. క్రికెట్ వర్గాల సమాచారం ప్రకారం.. విదేశీ ఆటగాళ్లు, ఫ్రాంచైజీల విషయంలో బీసీసీఐ జోక్యం చేసుకోదని స్పష్టత ఇచ్చింది. అలాగే వచ్చే వేలం కోసం పర్స్ విలువను పెంచాలనే విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇక 2027 సీజన్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభించడంపైనా కసరత్తు చేస్తున్నట్లు బీసీసీఐ పేర్కొంది. అలాగే రెండేళ్ల తర్వాత నుంచి ఐపీఎల్ మ్యాచులను పెంచేందుకూ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. విదేశీ ఆటగాళ్ల అందుబాటు విషయంలో ఇటీవల ముగిసిన సీజన్ సమయంలో ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై బీసీసీఐ చర్యలు తీసుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. కానీ, ఈ విషయంలో జట్లకు, ఆటగాళ్లకు మధ్య వారధిగా వ్యవహరించాలనే ఉద్దేశం తమకు లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఎవరైనా విదేశీ ప్లేయర్ వేలంలో సదరు ఫ్రాంచైజీకి వెళ్లాక.. సీజన్‌కు అందుబాటులో ఉండకపోతే రెండేళ్లపాటు బ్యాన్ విధించే అవకాశం ఉంది. అదీనూ గాయం కారణంగా చూపిస్తే మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోనక్కర్లేదు. "ఆటగాళ్లకు కస్టోడియన్స్ ఫ్రాంచైజీలే. అందుబాటులో ఉండటంపై వారికే వదిలేస్తున్నాం. కొందరు తమ జాతీయ జట్టు కోసం ఐపీఎల్‌లో పాల్గొనకూడదని నిర్ణయించుకుంటారు. కానీ, మా రూల్స్ మాత్రం స్పష్టంగా ఉన్నాయి. గాయం మినహా.. మరే ఇతర కారణమైనా సరే రెండేళ్లపాటు బ్యాన్ విధిస్తాం" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.




# పబ్లిసిటీ స్టంట్లు..

# పడొలి స్టేంట్లు!

శ్రావణ వాణి

**ఒక్క ముద్ద బువ్వ పెట్టి..**
**కెమెరాలో బంధిస్తున్నారు!**

**ఓ అరటి పండు కొనిచ్చి..**
**లైకులు సంపాదిస్తున్నారు!**

**కాస్త కనికరం చూపి..**
**కామెంట్లు కొట్టేస్తున్నారు!**

**సేవ చేసినట్లు పోజిచ్చి**
**షేర్లు దోచేస్తున్నారు!**

**అధికారుల్లోనూ ప్రచార యావ..**
**తగ్గిపోతోంది అసలైన ప్రజాసేవ..**

**వంకలు తిరిగే కెమెరా**
**యాంగిల్స్..**
**అబ్బో.. ఎన్నెన్నో వెర్రివేషాల్..**
**ఎక్కడ చూసినా అంతా**
**కృత్రిమత్వం!**

**పోవాలి ఈ సామాజిక జాడ్యం!!**
**డిజిటల్ షోలతోనే నిరంతరం!**
**వాస్తవంలోకి రావాలి మనందరం!!**




శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ
9581291919

ఇప్పుడున్న కాలం ఎంత విచిత్రమైనదంటే.. మనిషి జీవించడం అంటే శ్వాస తీసుకోవడం మాత్రమే కాదు, ఆ శ్వాసను ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం! ప్రచారం పట్ల పెరిగిన ఈ విపరీతమైన వ్యామోహం సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఒక మానసిక వ్యాధిలా వ్యాపించింది. విచక్షణ మరిచి, విలువలను వదిలేసి చేసే ఈ 'పబ్లిసిటీ స్టంట్లు' సమాజ ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఒకప్పుడు సాయం చేయడం అంటే 'కుడి చేత్తో చేసేది ఎడమ చేతికి తెలియకూడదు' అనే సంప్రదాయం ఉండేది. కానీ ఇప్పుడు, ఒక పేదవాడికి అరటిపండు ఇస్తూ పదిమంది ఫొటోలకు ఫోజులివ్వడం నిత్యకృత్యమైంది. ఆకలి తీర్చడం కంటే, ఆ ఆకలిని కెమెరాలో బంధించి 'లైకులు' సంపాదించుకోవడమే లక్ష్యంగా మారుతోంది. ఇక్కడ సాయం అనేది ఒక ప్రదర్శన వస్తువుగా మిగిలిపోతోంది. ఇక, రీల్స్ పిచ్చి గురించి ఎంత చెప్పినా తక్కువే. వ్యూస్ కోసం ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం, రైలు పట్టాలపై, ఎత్తైన భవనాలపై ఫొటోలు తీయడం వంటివి పరాకాష్టకు చేరుతున్నాయి. ఈ క్రమంలో ప్రాణాలు పోతున్నా యువతలో మార్పు రాకపోవడం ఆందోళనకరం. అలాగే, వ్యక్తిగత జీవితాన్ని బజారున పెట్టడం మరో వింత ధోరణి. పబ్లిసిటీ కోసం చేసే ఈ ప్రయత్నాల్లో సహజత్వం చచ్చిపోతోంది. ప్రతి సందర్భాన్ని అనుభవించడం కంటే, దాన్ని ఇతరులకు చూపించాలనే తాపత్రయమే ఎక్కువగా కనిపిస్తోంది. గుర్తింపు కోరుకోవడం మనిషి సహజ లక్షణమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రైవసీని దెబ్బతీసేలా లేదా ప్రాణాలను పణంగా పెట్టేలా మారుతోంది.

## ఐఏఎస్, ఐపీఎస్‌లూ 'డిజిటల్ షో'

ఒకప్పుడు సివిల్ సర్వెంట్ అంటే నిబద్ధతకు నిలువుటద్దం. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అంటే తెర వెనుక ఉండి పాలనా యంత్రాంగాన్ని నడిపించే వ్యూహకర్తలు. కానీ, నేడు పరిస్థితి తలకిందులైంది. క్షేత్రస్థాయి పోలీసు కానిస్టేబుల్ నుంచి సచివాలయంలో కూర్చునే ఉన్నతాధికారుల వరకు అందరికీ 'ప్రజా సేవ' కంటే 'ప్రచార యావ' ఎక్కువైంది. విధి నిర్వహణ పక్కకు పోయి, సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కోసం పాకులాడటం ఒక వ్యసనంగా మారుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో పని చేసే ప్రతి అధికారి ప్రజల పన్నుల డబ్బుతో జీతం తీసుకుంటారు. వారి సమయం, శక్తి సామర్థ్యాలు కేవలం ప్రజా హితం కోసమే వెచ్చించాలి. అయితే, దురదృష్టవశాత్తూ కొందరు అధికారులు తమ విధులను ఒక బాధ్యతగా కాకుండా, తమ వ్యక్తిగత ఇమేజ్‌ను పెంచుకునే మార్గంగా చూస్తున్నారు. బాధితులకు సాయం చేయడం, అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం వంటివి సహజంగా జరగాల్సిన పనులు. కానీ, వాటిని పది కెమెరాల మధ్య చిత్రీకరించి, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో 'రీల్స్'గా మార్చి సామాజిక మాధ్యమాల్లో వదలడం ఏ రకమైన సేవ? ఒక చిన్న తనిఖీకి వెళ్లినా, ఒక పేదవాడితో కలిసి భోజనం చేసినా వంద కెమెరాలు వెంటే ఉంటున్నాయి. ఆ దృశ్యాలను సినిమాటిక్ రీతిలో ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వదలడం ఒక ట్రెండ్‌గా మారింది. ప్రజా సమస్యల పరిష్కారం కంటే 'లైకులు', 'షేర్ల' సంపాదనే లక్ష్యంగా సాగుతున్న ఈ 'పబ్లిసిటీ స్టంట్లు' ఐఏఎస్ వ్యవస్థకే మచ్చ తెస్తున్నాయి. నిజానికి అధికారులు ప్రజల్లో ఉండాలి, వారి కష్టసుఖాలు తెలుసుకోవాలి. కానీ అది ఒక ప్రదర్శనగా మారకూడదు. బాధితుల దగ్గరకు వెళ్లినప్పుడు వారి సమస్య తీర్చడం కంటే, వారితో దిగే ఫొటో పర్ఫెక్ట్‌గా ఉందా లేదా అని చూసుకోవడం అధికారుల నైతికతను ప్రశ్నిస్తోంది. క్షేత్రస్థాయిలో ఫలితాలు సున్నా.. సోషల్ మీడియాలో మాత్రం 'హీరోయిజం' అన్నట్లుగా తయారైంది పరిస్థితి. కొందరైతే ఏకంగా సినిమా స్టార్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లను తలపిస్తూ రీల్స్ చేయడం విడ్డూరం. పెండింగ్ ఫైళ్లు, క్షేత్రస్థాయి సమస్యలు గుట్టలుగా పేరుకుపోతుంటే, వాటిపై దృష్టి పెట్టకుండా కెమెరా యాంగిల్స్ సరిచూసుకోవడం విచారకరం. ఈ 'పీఆర్ స్టంట్ల' వల్ల అసలు లక్ష్యం నీరుగారిపోతోంది. ఒక అధికారి నిరంతరం కెమెరా ఫోకస్‌లో ఉండాలని కోరుకున్నప్పుడు, అక్కడ సహజత్వం మాయమై కృత్రిమత్వం ప్రవేశిస్తుంది. నిజాయితీగా పని చేసే అధికారుల కంటే, సోషల్ మీడియాలో హడావుడి చేసే వారికే గుర్తింపు లభిస్తుండటంతో వ్యవస్థలో సమతుల్యత దెబ్బతింటోంది. ఇది తోటి ఉద్యోగుల్లో అసహనాన్ని, ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపుతోంది. అధికారులు తాము 'ప్రజా సేవకులం' అనే విషయాన్ని మరిచి, 'సెలబ్రిటీలం' అనే భ్రమలో బతుకుతున్నారు. ప్రభుత్వాలు కూడా ఈ ధోరణిని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. విధి నిర్వహణలో గోప్యత, హుందాతనం సివిల్ సర్వీస్ నిబంధనల్లో ప్రాథమిక సూత్రాలు. అందుకే, ప్రచారం కోసం పాకులాడుతూ కార్యాలయ సమయాన్ని వృథా చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అధికారి పని తీరు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి కానీ, స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ల మీద లైక్స్ తీసుకురావడం కాదు. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. నిజమైన అధికారికి గుర్తింపు తాను చేసే పని ద్వారా రావాలి కానీ, చేయించుకునే ప్రచారం ద్వారా కాదు. 'రీల్' లైఫ్ నుంచి బయటకు వచ్చి 'రియల్' సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టినప్పుడే ఆ పదవులకు గౌరవం, వ్యవస్థకు బలం చేకూరుతాయి.



## పరాకాష్టకు పబ్లిసిటీ పిచ్చి

**నకిలీ మరణం:** ప్రముఖ నటి పూనమ్ పాండే తాను సర్వైకల్ క్యాన్సర్‌తో మరణించినట్లు ఒక నకిలీ ప్రకటన చేయించింది. ప్రచారం కోసమే ఇలా చేశానని చెప్పుకుంది.

**రైలు పట్టాలపై సాహసాలు:** ఉత్తర ప్రదేశ్‌లో ఒక యువకుడు రైలు వస్తున్నప్పుడు పట్టాల పక్కన నిలబడి రీల్ తీయబోయి, రైలు వేగానికి గాలిలో ఎగిరిపడి మరణించాడు.

**లోయలో పడ్డ కారు:** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో ఒక యువతి కారును రివర్స్ తీస్తున్నట్లు రీల్ తీయాలనుకుంది. బ్రేక్‌కు బదులు యాక్సిలరేటర్ తొక్కడంతో కారు నేరుగా లోయలోకి దూసుకెళ్లి ఆమె మరణించింది.

**బిస్కెట్ల పంపిణీ ప్రహసనం:** ఒక రాజకీయ నాయకుడు ఆసుపత్రిలోని రోగులకు పది రూపాయల బిస్కెట్ ప్యాకెట్లు పంచుతూ ఫొటోలు దిగాడు. ఫొటో దిగడం పూర్తయిన వెంటనే ఆ ప్యాకెట్లను రోగుల దగ్గర నుంచి తీసేసుకున్న ఘటన రాజస్థాన్‌లో వెలుగు చూసింది.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010.